క్లుప్తంగా

జాబ్‌మేళాలో 28 మందికి ఉద్యోగాలు

నిడదవోలు: జిల్లా ఉపాధి కల్పనా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 28 మంది అభ్యర్థులు ఐదు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. ఐదు కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 89 మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్కిల్ కాలేజీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీరామచంద్రమూర్తి, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్లు బాబు, సస్య,సత్య శ్రీనివాస్, జిల్లా నియామక అధికారి డి.పావనీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లైమ్‌లు విడుదల చేయాలంటూ ధర్నా

నిడదవోలు: కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ప్రసూతి, మరణ, వివాహ, వైద్య తదితర క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఇందిరానగర్‌లోని అభ్యుదయ పెయింటర్స్, ఆర్టిస్టుల యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రవ్వ సురేష్‌కుమార్ మాట్లాడుతూ పెయింటింగ్ కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. బిల్డింగ్ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో నిర్మాణాలు కుంటుపడడంతో పెయింటింగ్ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువు తీరి నాలుగు నెలలు కావస్తున్నా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

బైక్‌ను ఢీకొని కారు బోల్తా

నల్లజర్ల: అనంతపల్లి శివారు వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంకు చెందిన చోదిమళ్ల శ్రీను అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై శ్రీను టోల్‌ప్లాజా వద్దకు వెళ్తుండగా ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న చిన్నకారు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొంది. ఈ ఘటనలో సడన్ బ్రేక్ వేసిన కారు డివైడర్‌పై బోల్తా పడింది. అందులో ఉన్న నలుగురు వ్యక్తులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.బైక్‌పై ఉన్న శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైవే అంబులెన్స్‌లో తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట క్లబ్‌పై పోలీసుల దాడి

తోపులాటలో ఇద్దరికి గాయాలు



గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పంతాడ సత్తిబాబు

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి స్పెషల్ పోలీసులు దాడి చేశారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జరిపిన ఈ దాడిలో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారు పరారైనట్టు డీఎస్పీ జి.దేవకుమార్ ప్రకటించారు. పేక ముక్కలతో పాటు రూ.5,800 నగదు, క్వాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పేకాడుతుండగా పోలీసులు రావడంతో లిటరరీ క్లబ్‌లో తోపులాట చోటు చేసుకుంది. దీంతో మెట్లపై నుంచి కింద పడి కాకినాడకు చెందిన పంతాడ సత్తిబాబు అనే వ్యక్తి తలకి తీవ్ర గాయమైంది. ఆయన రాజమహేంద్రవరంలోని కిమ్స్ (బొల్లినేని) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగిత సుభాష్ చంద్రబోస్ అనే మరో వ్యక్తి మెట్ల వద్ద పడిపోవడంతో కాలు విరిగిందని క్లబ్ నిర్వాహకులు చెబుతున్నారు. మూడు రోజులుగా ఇక్కడ పేకాట కొనసాగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. తమ క్లబ్‌లో పేకాట (రమ్మి) ఆడుకునేందుకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు క్లబ్ గౌరవాధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి లైవ్ తీసుకోవచ్చునన్నారు. ఇక్కడ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగవన్నారు. దీనిపై కోర్టు ధిక్కరణ కేసుతో పాటు పోలీసులపై ప్రైవేట్ కేసు కూడా వేస్తామన్నారు.

ఇసుక లారీపై కేసు

కొవ్వూరు: వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలి స్తున్న లారీని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిల్లు లేకుండా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో లారీని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు నిమిత్తం గనుల శాఖ అధికారులకు పంపనున్నట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

కొవ్వూరు: చిడిపి గ్రామంలో శుక్రవారం ఉదయం పట్టపగలు దొంగలు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. షేక్ సురబీ ఇంట్లో ఆరు కాసుల బంగారం, రూ.50 వేల నగదు, తడికొప్పుల పోసియ్య ఇంట్లో ఏడుతులాల వెండి, కొంత సొమ్ము అపహరించుకుని పోయారు. కొవ్వూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

రోడ్లు శిథిలం.. ప్రయాణం నరకం

- నిడదవోలు- నరసాపురం రోడ్డు అధ్వానం
- వర్షాలకు రోడ్డు గుంతల్లో చేరిన నీరు
- రాత్రివేళల్లో గోతులు కనపడక ప్రమాదాలు
- మరమ్మతులు చేపట్టని అధికారులు



అధ్వానంగా నిడదవోలు- నరసాపురం రహదారి

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో రోడ్లపై గోతులు పూడుస్తాం. నిడదవోలు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం. అంటూ 2024 ఏప్రిల్ 10న నిడదవోలు గణేష్ చౌక్ వద్ద జరిగిన బహిరంగ సభలో జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా చిన్న గొయ్యి కూడా పూడ్చక పోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. నిత్యం ఎంతో మంది వాహనదారులు రాకపోకలు సాగించే నిడదవోలు - నరసాపురం ఆర్ అండ్ బీ ప్రధానరహదారి నరకానికి చిరునామాగా గుంతల మయంగా మారిపోయింది. పెద్దపెద్ద గుంతలతో ఉన్న ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు నరకం చూస్తున్నారు. వర్షం వస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోకి నీరు చేరుతోంది. దీంతో కొత్తవారికి ఈ గోతుల గురించి తెలియక పోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్దపెద్ద కార్లలో ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజాప్రతినిధులు, అధికారులకు మాత్రం గుంతలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ఎంతో అభివృద్ధి చేశామంటూ సంబరాలు చేసుకోవడం తప్ప, రహదారుల కనీస మరమ్మతులను కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వేల సంఖ్యలో వాహనాలు

నిడదవోలు- నరసాపురం, కానూరు-తణుకు రోడ్లలో నిత్యం వేల సంఖ్యలో బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, బైక్‌లతో పాటు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, డి.ముప్పవరం, కలవచర్ల, మునిపల్లి గ్రామాల పరిధిలో రహదారి శిథిలావస్థకు చేరుకొని అధ్వానంగా మారింది. పెరవలి మండలం కానూరు, నడుపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను, మోర్త, ఉండ్రాజవరం మధ్య ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్‌లు తణుకు, రాజమహేంద్రవరం వెళ్లేందుకు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రహదారి అధ్వానంగా ఉండడంతో సమయానికి అంబులెన్స్ గమ్యానికి చేరుకోలేక రోగుల ప్రాణాలకు అపాయం ఏర్పడుతోంది. డి.ముప్పవరంలో పెద్దపెద్ద గోతుల వద్ద రోడ్లుపై ప్లాస్టిక్ బకెట్‌లు పెట్టడంతో అక్కడ గోతులు ఉన్నాయని వాహనదారులు గమనించి పక్కనుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతులూ చేపట్టరా?

రోడ్లు గుంతలు పడిన చోట తాత్కాలికంగా తారు, రాళ్లు వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరిచిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈరోడ్ల నిర్మాణాలపై అధికారులతో జిల్లాస్థాయిలో ప్రజాప్రతినిధులు కనీసం సమీక్ష కూడా చేయకపోవడంపై వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అధ్వానంగా తయారైన నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిడదవోలు మండలం డి.ముప్పవరం వద్ద గోతులు ఉండడంతో రోడ్డుకు అడ్డంగా పెట్టిన ప్లాస్టిక్ బకెట్



సమిశ్రగూడెం వద్ద శిథిలావస్థకు చేరిన రోడ్డు



నిడదవోలు-డి.ముప్పవరం మధ్య అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఇసుక ఉచితం హామీ గాలికి వదిలేసింది



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



కొవ్వూరులో టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

- కూటమి ప్రభుత్వంపై సీపీఎం ధ్వజం
- నిడదవోలులో ఆ పార్టీ శ్రేణుల ధర్నా

నిడదవోలు: ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వం తక్షణమే ఇసుక ర్యాంపులు తెరిపించాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇసుక ఉచితం హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గత 4 నెలలుగా అవలంబించిన ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కన్నా కూటమి ప్రభుత్వంలో ఇసుకు ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఇసుక దొరకడమే గగనమైపోయిందని రాంబాబు విమర్శించారు. ర్యాంపుల దగ్గర పెత్తందారులు స్వేచ్ఛగా ఇసుక దందాలు జరుపుకుంటున్నారని ఆరోపించారు. అదే సమయంలో సామాన్యులకు మాత్రం ఇసుక పెనుభారంగా మారిందని ఆయన విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఇసుక విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓ గోపి, ఎ.డానియల్ ఎ.రాంబాబు ఈ.మునియ్య, బి.నరేష్, ఎస్.రాము రాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కొవ్వూరులో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో..

కొవ్వూరు: కూటమి నేతలు ఇచ్చిన ఇసుక ఉచితం హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, ఇసుక సరఫరాను పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోను, టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనుమతులున్న ఇసుక ర్యాంపులను తక్షణం తెరిపించి ఇసుక అందుబాటులోకి తేవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరాబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించకుండా కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. మూడు నెలలు నుంచి ఇసుక దొరకని కారణంగా కార్మికులు ఉపాధికి దూరమయ్యారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు మైగాపుల నాగేశ్వరరావు, మానికిరెడ్డి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో వైఎస్సార్ సీపీ నాయకుల భేటీ



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన పోసిన శ్రీలేఖ, పిట్టా శ్రీనివాస్, మేన్ని సతీష్, మెన్ని గణేష్, చిట్టయ్య,పి. నాని తదితరులు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు తాడేపల్లిలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, మండల యువజన విభాగం అధ్యక్షుడు మేన్ని సతీష్, నాయకులు మేన్ని గణేశ్, శేషు, చిట్టయ్య, జిల్లా యువజన విభాగం నాయకుడు పప్పొప్పుల నాని తదితరులు జగన్‌కు కలిసిన వారిలో ఉన్నారు.

గోపాలపురం జెడ్పీటీసీ సభ్యురాలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోపాలపురం జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత దంపతులు

గోపాలపురం: స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత గురువారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గాయత్రీ దేవి అలంకారంలో జగన్మాత



దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారికి కుంకుమ పూజలు



తాళ్లపూడిలో గాయత్రీదేవి అలంకరణలో



కె.సావరంలో గాయత్రీదేవి అలంకరణలో

దేవరపల్లి: శరన్నవరాత్ర మహోత్సవాల రెండో రోజైన శుక్రవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి, భక్తులు విశేష పూజలు చేశారు. మహిళలు ఆలయాలకు తరలి వచ్చి కుంకుమార్చన చేశారు. దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారి ఆలయం, హైస్కూల్ ప్రాంతంలోని బాలదుర్గమ్మ వారి ఆలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి: స్థానిక నవదుర్గా శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అర్చకుడు అల్లూరి శివ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీదేవి ఆలయం వద్ద టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అలాగే మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, వేగేశ్వరపురంలోని దుర్గా సాయిరామ్ మేదర కులస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగన్మాతకు విశేష పూజలు జరుగుతున్నాయి.

గోపాలపురం: స్థానిక దుర్గాదేవి, లలితాంబిక అమ్మవారి ఆలయాలతో పాటు వివిధ గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవార్లను గాయత్రీదేవిగా అలంకరించారు. భవానీ మాల ధారులు నిష్ఠగా కొలిచారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు కందగిరి గౌతమ్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త గ్రామంలో కొలువైన విజయ కనకదుర్గమ్మ, పాలంగి కనకదుర్గమ్మ, కె.సావరంలోని దుర్గమ్మ అమ్మవార్లు శుక్రవారం గాయత్రీ దేవి అలంకరణలో దర్శన మిచ్చారు.

పెరవలి: దేవీ నవరాత్రులకు తోడు శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరు గ్రామాల ఆలయాల్లో కుంకుమార్చనలు చేశారు. ఖండవల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద వందలాది భక్తులు ఒక్కసారే కూర్చుని పూజలు చేశారు. అలాగే అన్నవరప్పాడు శక్తమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని సామూహిక వ్రతాలు చేశారు.

ఎర్ర కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం


- మంత్రి కందుల దుర్గేష్ హామీ
- మండల సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని శుక్రవారం మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షత నిర్వహించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎర్ర కాలువ ఏటిగట్లు పటిష్ఠం చేయడంతో పాటు గత జూలైలో నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రజాప్రతినిధుల సమన్వయంతో అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు మంజూరు చేశామని, త్వరలోనే డ్రైన్ల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం కల్పించలేదని మంత్రి దుర్గేష్ విమర్శించడంతో వైఎస్సార్ సీపీ సర్పంచులు తిక్కా శ్రీనివాస్, కొండపల్లి శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో రాజకీయాల వల్ల మాత్రమే పెండ్యాల, గోపవరం, కోరుపల్లి గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు సమాధానమిచ్చారు. అభివృద్ధి పనులకు అవసరమైన తీర్మానాలు పంచాయతీ పాలకవర్గాలు ఇవ్వాల్సి ఉండగా మీరు ఇస్తారా.. లేకపోతే మా మంత్రిగారికి చెప్పి తీర్మానం చేయించుకుంటామని కూటమి నాయకులు గ్రామాల్లో హడావుడి చేస్తున్నారని విజ్జేశ్వరం సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ సమావేశంలో మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకు వచ్చారు. తాడిమళ్ల సర్పంచ్ బయ్యే రాధారాణి మాట్లాడుతూ తాడిమళ్ల పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలని, ఆవచెర్వు గట్లు పటిష్ఠం చేయడంతో పాటు రోడ్డు నిర్మించాలని, ఆర్ అండ్ బీ పరిధిలోని ఆక్రమణలను తొలగించాలని కోరారు. కంసాలిపాలెం సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కంసాలిపాలెం-మాధవరం వంతెన వెంటనే నిర్మించాలని, పురాతన శివాలయాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, ఎంపీపీ పి.శామ్యూల్, ఈఓపీఆర్డీ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ నాగరాజు నాయక్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో కోటసత్తెమ్మ



కోటసత్తెమ్మవారు

నిడదవోలు రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాల రెండో రోజైన శుక్రవారం తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో 347 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదంగా అందజేశారు. వివిధ రూపాల్లో అమ్మవారికి శుక్రవారం రూ.1,88,425 ఆదాయం వచ్చింది. అలాగే సమిశ్రగూడెంలోని పుంతలో మునలమ్మ ఆలయ వద్ద మహిళలు భజనలు, కుంకుమ పూజలు చేశారు. లోహియా నగర్‌లోని కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరిస్వామి ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సింగవరంలో ముత్యాలమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

గ్రామ దేవతలకు మకర తోరణం సమర్పణ



నక్కిర్లమ్మ, సోమాలమ్మలకు మకరతోరణం పూజలు నిర్వహిస్తున్న దాతలు

గోపాలపురం: గోపాలపురం గ్రామదేవతలు నక్కిర్లమ్మ, సోమాలమ్మలకు శుక్రవారం గ్రామానికే చెందిన దోనాదులు సత్యారెడ్డి దంపతుల రూ.కొన్ని వేల విలువైన మకర తోరణాన్ని సమర్పించారు. తొలుత ఆలయ ప్రధానార్చకుడు అనిపెద్ది రామకృష్ణ సిద్ధాంతి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లకు మకర తోరణాన్ని అలంకరించారు. తర్వాత భక్తులకు అన్న సమారాధన చేశారు.

ఆలయ గోపురానికి రూ.50 వేల విరాళం



పెరవలి సాయిబాబా ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం ఇచ్చిన బేడ బుడుగ జంగాల యూనియన్

పెరవలి: స్థానిక శిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ ఆలయ గోపుర నిర్మాణానికి బేడ, బుడగ, జంగాల యూనియన్ శుక్రవారం రూ.51 వేలు విరాళంగా ఇచ్చింది. గతంలో ఇదే యూనియన్ బాబా ఆలయానికి ముందు రూ.40 వేల వ్యయంతో షెడ్డు నిర్మించింది. ఆలయ కమిటీ తరఫున సభ్యుడు బొడ్డు రామాంజనేయులు ఆ యూనియన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



వేణుగోపాల్ రెడ్డి

దేవరపల్లి: పలువురు అధికారులు శుక్రవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. దేవరపల్లి ఎంపీడీవోగా ఎస్.వేణుగోపాల్ రెడ్డి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. బుట్టాయగూడెం మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన డీబీఆర్ కృష్ణంరాజు మే 31న ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈఓపీఆర్డీ పి. ప్రభాకరరావు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేస్తున్నారు. ప్రభాకరరావు ఎ న్టీఆర్ జిల్లాకు బదిలీ కావడంతో వేణుగోపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించా రు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సా గర్‌ను కొయ్యలగూడెం ఆర్ డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ ఆఫీసుకు బదిలీ చేశారు.

నిడదవోలు రూరల్: స్థానిక ఎంపీడీఓగా పని చేస్తున్న పి.శామ్యూల్ అత్తిలి ఎంపీడీవోగా బదిలీ కావడంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా డి.లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా ముదినేపల్లి ఈఓపీఆర్డీగా పని చేసిన లక్ష్మీనారాయణ నిడదవోలు ఈఓపీఆర్డీగా బదిలీపై వచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఫణీశంకర్ కుక్కునూరు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ కాగా ఉండ్రాజవరం మండల సీనియర్ అసిస్టెంట్ నాగ్‌నాథ్ నిడదవోలు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

దేవరపల్లి: పంచాయతీరాజ్ శాఖ గోపాలపురం సబ్ డివిజన్ ఇంజినీరింగ్ అధికారిగా ఎం. వెంకటలక్ష్మి నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. రాజోలు సబ్ డివిజన్ నుంచి గోపాలపురం సబ్ డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన కె. బాలకృష్ణ జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌కు బదిలీపై వెళ్లారు.

ఉండ్రాజవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా వి.రామారావు, ఈవోపీఆర్డీగా ఆంజనేయ శర్మ, సీనియర్ అసిస్టెంట్‌గా రామకృష్ణ, టైపిస్ట్‌గా కె.ఉమా మహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా ఎ.కనకదుర్గ, సర్వేయర్‌గా జి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్‌గా పీవీ సత్యనారాయ ణ, వాచ్‌మన్‌గా జి.రామారావు బాధ్యతలు చేపట్టారు.

ఎంపీడీవో శ్రీదేవికి సత్కారం

గోపాలపురం: స్థానిక ఎంపీడీవోగా పని చేసిన రసపుత్ర శ్రీదేవిని శుక్రవారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వివిధ పార్టీల నాయకులు ఘనంగా సత్కరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీదేవి చాగల్లు మండలానికి బదిలీ అయ్యారు. గత ఐదేళ్లుగా ఇక్కడ ఎంపీడీవో పనిచేసిన శ్రీదేవి వివిధ సమస్యలను పరిష్కరించారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెలగా శ్రీరామమూర్తి, పిన్నమనేని వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.